క్లుప్తంగా

11న లోక్ అదాలత్

అల్వాల్: ఇరువురు రాజీపడటంతోనే సత్వర న్యాయం చేకూరుతుందని మేడ్చల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సురేష్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 11న మల్కాజిగిరి న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని పెండింగ్‌లో కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. చిన్న చిన్న కారణాలతో సంవత్సరాల తరబడి న్యాయస్థానంలో కేసులు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఇరువైపులా వారు న్యాయమూర్తుల సమక్షంలో రాజీమార్గాన్ని ఎంచుకుంటే సత్వర న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

మల్లాపూర్: నాచారం ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో ప్రీ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రాచకొండ కమిషనర్‌రేట్ పరిధిలోని నాచారం, మేడిపల్లి, ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పలు కేసులను ఎల్బీనగర్ 3వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు జరిమానా విధించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మల్లాపూర్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ మీడియా సెల్ కన్వీనర్‌గా మల్లాపూర్ అశోక్‌నగర్‌కు చెందిన రంగు మల్లికార్జున్‌గౌడ్‌ను నియమిస్తూ కన్వీనర్ ఆర్కె శ్రీనివాస్ ఉత్తర్వులు అందజేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, ఉప్పల్ కన్వీనర్ బాలచందర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్సు ఉత్సవాలకు బస్సు సౌకర్యం

మౌలాలి: మౌలాలి హజ్రత్ అలీ దర్గా ఉర్సు ఉత్సవాలకు టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులను శనివారం మౌలాలి కమాన్ వద్ద బీజేపీ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి హైదర్ బాక్రీ హాజరై ప్రారంభించారు. అనంతరం మౌలాలి చిల్లా దర్గా వరకు పాదయాత్ర నిర్వహించి బాబా ఆశీస్సులు తీసుకున్నారు. గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, ఫాతిమా బాక్రీ, శివ, శబ్బర్, రజాక్, సాదిక్, శ్రీను, సాయి, కిరణ్, వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టు ప్రోత్సహించాలి



శ్రీచక్రి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



అల్వాల్ లయోల అకాడమిలో విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న వినోద్‌కుమార్

కుషాయిగూడ: విద్యార్థులను వారి అభిరుచులకు తగ్గట్టుగా ప్రోత్సహించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడ శ్రీచక్రి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. అనంతరం పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. పాఠశాల ఫౌండర్ చైర్మన్ మొలుగు ప్రతాప్‌రెడ్డి, కరస్పాండెంట్ స్వర్ణలత, డాక్టర్ మొలుగు చక్రధర్‌రెడ్డి, డాక్టర్ రష్మి, ప్రిన్సిపల్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విద్యతో పాటు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

అల్వాల్: విద్యతో పాటు వృత్తి నైపుణ్యం పెంచుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విశ్రాంత ఐఎఫ్ఎస్ ఆఫీసర్ వినోద్‌కుమార్ అన్నారు. అల్వాల్ లయోల అకాడమిలో శనివారం జరిగిన డిగ్రీ, పీజీ విద్యార్థులు 7వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఎంచుకున్న రంగంలో నైపుణ్యం సాధించాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ.రాములు, ప్రొ.అంజయ్య, ప్రొ. శ్రీనివాస్, ప్రొ.కృష్ణంరాజు, లయోల అకాడమి ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి, కరస్పాండెంట్ అమరరావు, వైస్ ప్రిన్సిపల్ అరుల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఫెస్ట్ ఇండియా ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాల అమృత మహోత్సవాలు నిర్వహించిన సందర్భంగా అన్ని ప్రాంతాలు, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి సంఘీ, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

మల్లాపూర్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల డైరెక్టర్ సంపత్‌రెడ్డి, డాక్టర్ కృష్ణమోహన్ అన్నారు. నాచారం సుప్రభాత్ మోడల్ హైస్కూల్‌లో వైజ్ఞానిక అభ్యాస ప్రదర్శనను శనివారం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అడ్మిన్ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వాగేశ్వరి, అడ్మిన్ ఆఫీసర్ ఆశలతా పాల్గొన్నారు.



సెయింట్ జాన్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

సెయింట్ జాన్ స్కూల్‌లో..

రామంతాపూర్: సెయింట్ జాన్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనను రెండవ రోజు శనివారం స్థానికంగా ఉన్న పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. సోలార్ బోర్ బావి, కిడ్నీ పనిచేసే విధానం తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి.



లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న చేస్తున్న గోపాల్‌రెడ్డి



నాచారం సుప్రభాత్ మోడల్ హైస్కూల్‌లో..

ప్రయాణికుల పాట్లు పట్టవా?

- శంకుస్థాపన చేశారు.. పనులు చేయడం మరిచారు
- వాజ్‌పేయినగర్ రైల్వే గేటు వద్ద కాంగ్రెస్ ధర్నా



వాజ్‌పేయినగర్ రైల్వేగేటు వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

అల్వాల్: ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం నేరేడ్‌మెట్ వాజ్‌పేయినగర్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రైల్వే గేటు వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌యూబీ నిర్మాణం కోసం శంకుస్థాన చేశారు.. కానీ నిర్మాణ పనులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని, ప్రయాణికుల ఇబ్బందులు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మంజూరుకు సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడంతోనే ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదన్నారు. నేరేడ్‌మెట్ నుంచి మల్కాజిగిరికి ప్రధాన రహదారి కావడంతో వేలాదిమంది ప్రయాణికులు ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తుంటారన్నారు. గేటు పడిన ప్రతిసారి కిలో మీటర్ల దూరం ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఆర్‌యూబీ నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జీడీ శ్రీనివాస్‌గౌడ్, గుత్తి రాంచందర్, వి.శ్రీనివాస్‌గౌడ్, రెబ్బ వాసు, జీకే. సాయి ప్రసాద్, కే.రాములు, ఎమ్మార్ శ్రీనివాస్, సానాది శంకర్, బుచ్చిబాబు, వేణు, నరసింహగౌడ్, హనుమంత్, రవి, సాయి, ప్రవీణ్, ఫరీద్, అవినాష్, సురేష్ యాదవ్, రుక్మత్, రజినికాంత్, చరణ్, ప్రమోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీఎన్‌రెడ్డినగర్ కాలనీ అభివృద్ధికి సహకరిస్తాం



వీఎన్‌రెడ్డినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులను సత్కరిస్తూ..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్ కాలనీ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందజేస్తామని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కాలనీ అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, రామచంద్రయ్య, రమేష్ చౌదరి, హన్మంతు చౌదరి, బాల్‌రాజ్, సూర్యభగవాన్ ఉన్నారు.

కాంగ్రెస్ ఏ బ్లాక్ ప్రధాన కార్యదర్శిగా మురళి



రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ప్రధాన కార్యదర్శిగా రామంతాపూర్‌కు చెందిన సుర్వి మురళీగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయనకు ఏ–బ్లాక్ అధ్యక్షులు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని, ఈ పదవి వచ్చేందుకు సహకరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, పరమేశ్వర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కీసరగుట్టకు అన్ని ప్రాంతాల నుంచి బస్సులు

కాప్రా: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తులకు రవాణా సౌకర్యం కల్పించడం కోసం టీఎస్ ఆర్టీసీ కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ వెంకన్న, డిప్యూటీ రీజనల్ మేనేజర్ అపర్ణ కళ్యాణిలు హాజరై రీజనల్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి అనంతరం కీసరగుట్టలో పర్యటించి చేయవల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. కీసరగుట్ట మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జంట నగరాల నుంచి అన్ని రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలని, ప్రయాణ ప్రాంగణంలో వారికి మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ స్థాయి అన్ని డిపోలకు చెందిన డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

అల్వాల్: కేన్సర్ డే సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్–మల్కాజిగిరి ఆధ్వర్యంలో శనివారం నేరేడ్‌మెట్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సెక్రటరీ కమ్ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్ జిల్లా అధికారి శంకర్ శ్రీదేవి అధ్యక్షత వహించి కేన్సర్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మల్కాజిగిరి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కోట రామచంద్రారెడ్డి, న్యాయవాదుల సంఘం సెక్రటరీ రాజు యాదవ్ పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఇతర అధ్యాపకులతో పాటు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

అల్వాల్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. డివిజన్ పరిధిలోని దినకర్‌నగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, శ్యాంసుందర్, ప్రభాకర్, సంతోష్, జనార్దన్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలంటూ బైక్ ర్యాలీ

బోడుప్పల్: ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం బోడుప్పల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు స్థలాల పేరుతో రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులు రద్దు చేసి వందలాది కుటుంబాలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. 40 ఏళ్ల క్రితం చేసిన లేఅవుట్‌లో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నామన్నారు. 2018 సంవత్సరం నుంచి వక్ఫ్ బోర్డు స్థలాలంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లైవుడ్ గోదాంలో అగ్ని ప్రమాదం

ఉప్పల్: పారిశ్రామికవాడలోని ఎగ్‌వుడ్ వినీర్ షీట్స్ గోదాంలో శనివారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పల్ పారిశ్రామికవాడలోని పురుషోత్తంకు సంబంధించిన ఎగ్‌వుడ్ ప్లైవుడ్ గోదాం ఉంది. శుక్రవారం తాళం వేసి కార్మికులు కొందరు పక్కనే ఉన్న గదిలో ఉన్నారు. శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగలు రావడంతో కార్మికులు పోలీసులు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యత పాటించకపోతే చర్యలు

రామంతాపూర్: రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ఓపెన్ నాలాపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కాంట్రాక్టర్లపై, అధికారులపై చర్యలు తప్పవన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలో పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు బండారు వెంకట్రావు, నిరంజన్‌చారి, నాయకులు జగదీష్, ఎడ్ల నాగేష్ పాల్గొన్నారు.

కుషాయిగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డి



కుషాయిగూడ: కుషాయిగూడ ఏసీపీగా వై.వెంకట్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కుషాయిగూడ ఏసీపీగా ఉన్న సాధన రష్మి పెరుమాళ్ తన శిక్షణ కాలం పూర్తి కావడంతో ఆమె స్థానంలో బదిలీపై వచ్చారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆయకు స్వాగతం పలికారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మల్లాపూర్: నాచారం బాపూజీనగర్, సరస్వతి నగర్‌లో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలోని పార్కు అభివృద్ధికి రూ.16 లక్షల నిధులు మంజూరు చేయించినందుకు కార్పొరేటర్‌ను కాలనీవాసులు సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జయరాజ్, వెంకటేష్, వేణుగోపాల్, హనుమంత్ రావు, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడంలో విఫలం

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులు కల్పించడంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ ఆరోపించారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో రూ.100 కోట్లు ఖర్చు చేసినట్లు మేయర్ చెబుతున్నారని, బోడుప్పల్ ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా ఎందుకు మారాయని ప్రశ్నించారు. మేయర్, కమిషనర్ ఎడమొహం పెడమొహంతో సమస్యలను గాలికి వదిలేసినట్లు చెప్పారు. కార్పొరేటర్లతో మాట్లాడే సమయం ఆయనకు లేదని, ఏ డివిజన్‌లో తిరగడం లేదని, ప్రజాసమస్యలను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. మూడేళ్లలో జరిగిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వీధి దీపాలు ప్రారంభం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ చక్రిపురం చౌరస్తా నుంచి చర్లపల్లి జైలుకు వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన 46 పోల్స్‌కు ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఆమె ప్రారంభించారు. చాలా రోజులుగా ఈ రోడ్డు మార్గంలో చీకట్లు కమ్ముకోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ప్రత్యూష, ప్రాజెక్టు ఇంజినీర్ ఉదయ్, కరుణాకర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నర్సింహ వంశరాజ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

మల్లాపూర్: స్వామి వివేకానందనగర్– భవానీనగర్ రోడ్ నంబర్–5లో భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలసి శనివారం పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంటోందని, నూతన డ్రైన్‌లైన్ వేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. డ్రైనేజీ వేసిన తర్వాతే నూతనంగా రోడ్డు వేయాలని కోరారు. కార్పొరేటర్, అధికారులు సానుకులంగా స్పందించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీవాసులు నెమలి రవికుమార్, సానాల రవిచారి, పీఆర్ ప్రవీణ్, శ్యాంసుందర్‌రెడ్డి, బుచ్చమ్మ, రఘు, శ్రీకాంత్, నరేష్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ ప్లేట్లు పడి కార్మికుడి మృతి

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు ఐరన్ ప్లేట్లు పడి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర(37) చర్లపల్లి పారిశ్రామికవాడలోని థైసస్ కృప్ప కంపెనీలో కార్మికుడు. శనివారం ఐరన్ ప్లేట్లను క్రేన్‌తో పైకెత్తుతుండగా ప్రమాదవశాత్తు అతడి తలపై పడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పనిచేసే చోట కనీస జాగ్రత్తలు పాటించని కారణంగా సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.